క్లుప్తంగా

కొండాకు ఘన సన్మానం



విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

పూడూరు: ఎంపీగా కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని మండల నాయకులు బుధవారం గజమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేశ్‌పటేల్, పూడూరు మండల పార్టీ అధ్యక్షుడు రాఘవేందర్, మండల నాయకులతో కలిసి మండలంలోని మన్నేగూడ చౌరస్తాలో గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు యూసూఫ్, బీజేపీ రాష్ట్ర నాయకులు సదానందరెడ్డి, వెంకటయ్య, రవీందర్, అనీల్, సుభాన్, పాండు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ బోనాలు



దుర్గమ్మ బోనాల ఉత్సవాలు

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని బుధవారం దుర్గమ్మ బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకొన్నారు. గ్రామంలోని మహిళలు కుటుంబ సమేతంగా బోనాలను ఎత్తుకొని ఊరేగింపు బయలుదేరి, అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామపెద్దలు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, రామకృష్ణ, లచ్చప్ప, వీరేశం తదితరులున్నారు.

కఠిన చర్యలు తప్పవు
మున్సిపల్ కమిషనర్



ఓ స్వీట్ హౌస్‌లో వాడిన నూనెను పారబోస్తున్న సిబ్బంది

అనంతగిరి: హోటళ్లు, బేకరీలు, స్వీట్ హౌజ్‌ల్లో వాడిన ఆయిల్‌ను మళ్లీ వాడితే కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన సిబ్బందితో కలిసి వికారాబాద్‌లోని పలు హోటళ్లు, బేకరీలు, స్వీట్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హోటళ్లలో ఆహార పదార్థాల పరిశుభ్రత, వంటశాలలు, వంట పాత్రలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హోటళ్లు, స్వీట్ షాపులలో నాణ్యమైన ఆయిల్‌ను ఉపయోగించాలన్నారు. ఆయిల్ నల్లగా అయ్యేంత వరకు వాడొద్దన్నారు. వినియోగదారులకు శుద్ధమైన మంచి నీటిని సరఫరా చేయాలని సూచించారు. చికెన్, మటన్, ఫిష్‌లను ఫ్రెష్‌గానే వాడాలన్నారు. ఈ సందర్భంగా అపరిశుభ్రంగా ఉన్న హోటళ్ల యాజమానులకు జరిమానాలు విధించారు. ఇక ముందు నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవన్నారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న నేతలు

కుల్కచర్ల: గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ మంగళవారం రాత్రి మృతి చెందిన దిలిప్‌కుమార్ అనే బాలుడి కుటుంబానికి మండలానికి చెందిన ఎన్నారై బుయ్యని రాఘవేందర్‌రెడ్డి స్థానిక నేతలు రాఘవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో రూ.60వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌గౌడ్ మాట్లాడుతూ.. 4సంవత్సరాల వయస్సులో దిలీప్‌కుమార్ మృతి చెందడం తీవ్ర విషాదకరమన్నారు. విషయం తెలుసుకున్న రాఘవేందర్‌రెడ్డి బాధిత కుటుంబానికి రూ.60వేల ఆర్థిక సహాయం అందించారని పేర్కొన్నారు. ఆయన అందించిన నగదును స్థానికులు బాధిత కుటుంబీకులకు అందజేశారు. కార్యక్రమంలో రాములు, రాజశేఖర్, జి.రాములు, మాసయ్య, సత్యయ్య, కృష్ణ పాల్గొన్నారు.

బక్రీద్ ప్రార్థనలకు ఏర్పాట్లు

తాండూరు: బక్రీద్ సందర్భంగా తాండూరు పట్టణంలోని ఈద్గా మైదానంలో బుధవారం మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. పండగ సమీపిస్తోండటంతో ముస్లింలు ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ప్రార్థనలు చేసేందుకు వచ్చేవారికి ఇబ్బందులు కలగకుండా మైదానాన్ని కార్మికులు శుభ్రం చేశారు.

మోగిన బడిగంట.. సమస్యలే తంటా!

వేసవి సెలవుల అనంతరం బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు తిరిగి తెరుచుకున్నాయి. అందంగా ముస్తాబైన పాఠశాలలు పిల్లలకు స్వాగతం పలికాయి. తొలిరోజు విద్యార్థులు ఉత్సాహంగా బడిబాట పట్టారు. పలుచోట్ల సమస్యలు స్వాగతం పలికాయి. ఇంకా మౌలిక వసతులు పూర్తికాక విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

- స్వాగతం పలికిన సమస్యలు
- బూజులు దులిపి, గదులు శుభ్రం చేసిన విద్యార్థులు
- మొదటిరోజు అంతంత మాత్రమే హాజరు
- అన్ని సదుపాయాలు కల్పిస్తామన్న ప్రజాప్రతినిధులు



తాండూరు రూరల్: విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పరిగి: ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని నంబర్ వన్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాల్లో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉంటారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు.

ప్రైవేటుకు దీటుగా..

బషీరాబాద్: సెలవులకు బైబై చెబుతూ.. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బుధవారం బడిగంట మోగింది. ఎప్పటిలాగే సర్కారు బడులు సమస్యల స్వాగత తోరణాలతో తెరుచుకున్నాయి. మొదటి రోజు కొన్ని పాఠశాలల్లో తాళం తీసేవారు కూడా లేకపోవడంతో ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి ప్రారంభించారు. అయితే సెలవుల అనంతరం పునః ప్రారంభమైన పాఠశాలల్లో విద్యార్థులు తరగతి గదులకు పట్టిన బూజును దులిపి, నీటితో గదులను శుభ్రం చేశారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తాం

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యాబోధనతో పాటు మౌలిక వసతులు కల్పిస్తామని తాండూరు ఎమ్మెల్యే బియ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ డ్రెస్‌లు అందజేశారు.

విద్యార్థులు బాగా చదువుకోవాలి

బంట్వారం: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలంటూ కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన ఎంఈఓ చంద్రప్ప తదితరులతో కలిసి కోట్‌పల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

బంట్వారం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను మరింతగా పెంచాలని పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని బార్వాద్ జెడ్పీహెచ్‌ఎస్‌లో స్థానిక ఎంపీటీసీ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేష్‌యాదవ్‌లతో కలిసి విద్యార్థులకు పాఠ్యపుస్తకాల అందజేశారు.

నేను ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నా..

తాండూరు రూరల్: నేను ప్రభుత్వ పాఠశాల్లో చదువుకున్నానని.. తనకు పాఠశాలల్లో సమస్యలు తెలుసని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కరన్‌కోట్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల్లో విద్యార్థులకు పుస్తకాలు, యునిఫాంలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవ చూపుతున్నారన్నారు. అమ్మ కమిటీలతో పాఠశాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ తారాసింగ్, ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఎంఈఓ వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ రవిగౌడ్ ఉన్నారు.

విద్యలో రాణించాలి

అనంతగిరి: ప్రతి విద్యార్థి పేదరికాన్ని అధిగమించి విద్యలో రాణించాలని రాష్ట్ర బీసీ కమీషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్ అన్నారు. బుధవారం వికారాబాద్ మండలంలోని సిద్దులూర్ గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు , పుస్తకాలు పంపిణీ చేశారు.

బడీడు పిల్లలు బడిలోనే ఉండాలి

తాండూరు టౌన్ : బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని మున్సిపల్ 20వ వార్డు కౌన్సిలర్ సంగీతాఠాకూర్ అన్నారు. బుధవారం పాఠశాల పున:ప్రారంభం సందర్భంగా గాంధీనగర్‌లోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దుస్తులు,పుస్తకాలు అందజేశారు.

విద్యా రంగానికి పెద్దపీట

బంట్వారం: విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. బుధవారం బంట్వారం జెడ్పీహెచ్‌ఎస్‌లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, ఇందుకు తమ సహకారం పూర్తిగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంతోష, స్పెషల్ ఆఫీసర్ సంధ్యారాణి, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ చంద్రప్ప ఉన్నారు.

ప్రభుత్వ బడిలోనే చదవాలి

పూడూరు: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ బడులను ఆధునీకరించడంతో పాటు ,మెరుగైన విద్యను అందిస్తుందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కంకల్ జెడ్పీ ఉన్నత పాఠశాల పున:ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రైవేటుకు దీటుగా ప్ర భుత్వ పాఠశాలల్లో విద్యాబోధన సాగుతుందన్నారు. తమ పిల్లలను ప్రభుత్వ బడికి పంపాలని కోరారు.

తొలిరోజు నామమాత్రంగా ..

తాండూరు: తాండూరు నియోజకవర్గంలో బడిగంట మోగింది. వేసవి సెలవులు ముగియడంతో బుధవారం విద్యార్థులు బడిబాట పట్టారు. పలు చోట్ల మామిడి తోరణాలతో అలంకరించారు. తొలిరోజు కావడంతో విద్యార్థులు పదుల సంఖ్యలో హాజరయ్యారు. పలు పాఠశాలల్లో తరగతి గదులను విద్యార్థులే శుభ్రం చేసుకున్నారు.

పూర్తికాని పనులతో ఇబ్బందులు..

అమ్మ ఆదర్శ పాఠశాల్లో భాగంగా ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలలో 5 రకాల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టింది. మహిళా సంఘాలకు బాధ్యతలను అప్పగించి పనులు చేయిస్తున్నారు. అయితే, ఈ నెల 5వ తేదీ లోపే పూర్తి చేసి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి. కాని పలు పాఠశాలల్లో ఇంకా పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులకు కూర్చునేందుకు తరగతి గదులు లేకా వరండాలో కూర్చొబెడుతున్నారు. మరోవైపు తాండూరు పట్టణంలోని నంబర్1 ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి పాఠశాల ప్రాంగణమంతా చిత్తడిగా మారింది. అలాగే,సాయిపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణమంతా వరద నీటి నిండి ప్రతి ఏటా ఇబ్బందులు కలుగుతోంది.

విద్యావ్యవస్థ ఉన్నతికి కృషి

కుల్కచర్ల: విద్యావ్యవస్థ ఉన్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించండి

తాండూరు రూరల్: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప అన్నారు. బుధవారం మండలంలోని గౌతపూర్ ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు యూనిఫాంలను అందజేశారు.

యాలాలో..

యాలాల: మండల పరిధిలోని రాస్నం ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అమ్మఆదర్శ కమిటీ చైర్మన్ లక్ష్మీ చేతులమీదుగా విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఇటీవల మంజూరైన నిధులతో పాఠశాలలో మరమ్మతులు చేపట్టామని, త్వరలో పెయింటింగ్ పనులు సైతం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

ఉత్సహంగా విద్యార్థులు

దుద్యాల్ : పాఠశాలలు బుధవారం పునఃప్రారంభం కావడంతో విద్యార్థులు ఉత్సహంగా పాఠశాల బయలుదేరారు. మండలంలోని హస్నాబాద్‌లోని బాలికల ప్రాథమిక కొన్నత పాఠశాలలోని ఉపాధ్యాయులు స్వాగత తోరణాలు కట్టి బెలూన్‌లతో అలంకరించి విద్యార్థులకు స్వాగతం పలికారు. దీంతో విద్యార్థులు సంతోషంగా తరగతి గదుల్లో కూర్చొని ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు విన్నారు.



పరిగి: పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తదితరులు



బషీరాబాద్: నవల్గ పాఠశాలలో గదులను శుభ్రం చేస్తున్న విద్యార్థులు



తాండూరు : వర్షం నీటి నిండిన పాఠశాల ప్రాంగణం

మొదటి రోజు అంతంత మాత్రమే..

దౌల్తాబాద్: వేసవి సెలవులు ముగిశాయి. బడిగంట మోగింది. నెలన్నర రోజు ఇంటి వద్ద ఆటపాటలతో గడిపిన విద్యార్థులు బుధవారం పాఠశాల బాటపట్టారు. హుషారుగా వెళ్లిన వారికి సర్కారు బడుల్లో పాత సమస్యలే స్వాగతం పలికాయి. స్కావెంజర్లు లేకపోవడంతో కొన్ని చోట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు శుభ్రం చేసుకున్నారు. తొలిరోజు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా కనిపించింది. అయితే, మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఎస్సీవాడలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించగా 60 మంది విద్యార్థులకు గాను 6 మంది మాత్రమే హాజరయ్యారు.



దౌల్తాబాద్: ఎస్సీవాడలో హాజరైన ఆరు మంది విద్యార్థులు

తెరుచుకోని ఉర్దూ పాఠశాల



ఏన్కతలలో తెరుచుకోని ఉర్దు పాఠశాల

మోమిన్‌పేట: మండలంలోని ఏన్కతల ఉర్దూ మీడియం పాఠశాల 12వ తేదీన బుధవారం తెరుచుకోలేదు. పాఠశాలల పునఃప్రారంభం రోజు తాళం వేసి ఉండటంతో ఇద్దరు విద్యార్థులు పాఠశాలకు వచ్చి ఉపాధ్యాయుడి కోసం వేచి చూశారు. కాగా, ఇక్కడ పనిచేస్తున్న ఉపా ధ్యాయురాలిని గతంలోనే విద్యార్థులు తక్కువగా ఉన్నారని సమీపంలో ఉన్న టేకులపల్లి పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపించారని సమాచారం

విద్యార్థులకు తప్పని తిప్పలు

కుల్కచర్ల: చౌడాపూర్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 1:30 నిర్వహించాల్సిన సమావేశం పాఠశాల మూసివేసే సమయం 4:30కు కూడా నిర్వహించలేదు. కార్యక్రమానికి హాజరు కావాల్సిన ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి రాక ఆలస్యం కారణంగా ఉపాధ్యాయులు విద్యార్థులను సాయంత్రం 6.15 నిమిషాలకు వరకు పాఠశాలలోనే ఉంచారు. మక్తవెంకటాపూర్, విఠలాపూర్, వీరాపూర్ తదితర గ్రామాలకు సూమారు 3కిలోమీటర్లు నడిచే వెళ్లాల్సిన విద్యార్థిని, విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

వివరాలు నమోదేనా.. ట్యాక్స్ విధిస్తారా?

ఆందోళనలో ప్రజలు

దుద్యాల్ : గ్రామీణ ప్రాంతాల్లో నిత్యం తాగునీటి సరఫరా చేస్తున్న మిషన్ భగీరథ నల్లాల నమోదు ప్రక్రియ ముమ్మరంగా సాగుతుంది. బుధవారం ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఇంటింటికి తిరుగుతూ నల్లాలు వివరాలు, ఆధార్ నంబర్, ఫోన్ నంబర్‌తో సహ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీంతో ప్రజలల్లో అయోమయం నెలకొంది. నల్లాల నమోదు తర్వాత పన్నులు విధిస్తారాని ప్రజల్లో ఆందోళన చెందుతున్నారు. మండలంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్‌రాథోడ్ ఇంటింటికీ తిరుగుతూ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సందర్భంలో ప్రజలు నుంచి ప్రశ్నలు వెల్లువెత్తాయి. దీంతో ఆయన ప్రభుత్వ ఆదేశాల మేరకు నమోదు చేస్తున్నట్లు వివరించారు. ఒక ఇంటికి ఒకే నల్లా ఉండాలి. అందరికీ సమానంగా నీటీ సరఫరా చేయడం సులభం అవుతుందనే ఆలోచనతో ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిందేమోనని ప్రజలు గుసగుసలాడుతున్నారు. ప్రజల్లో కలుగుతున్న ఆందోళనకు ప్రభుత్వం స్పందిస్తుందా లేదా వేచి చూడాలి.



వివరాలు సేకరిస్తున్న పంచాయతీ కార్యదర్శి రమేశ్ రాథోడ్

19న బహిరంగ వేలం

తాండూరు టౌన్ : తాండూరు మున్సిపల్ పరిధిలో వధశాలకు (మేకలు, గొర్రెలు)సంబంధించి వేర్వేరుగా చార్జీలను వసూలు చేసేందుకు చికెన్, మటన్, ఫిష్ వ్యర్థాల తొలగింపు అనుమతి కోసం ఈ నెల 19న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ విక్రమసింహారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జంతు వధశాల కోసం 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు అనుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. వేలంలో పాల్గొనదలిచిన వారు ఈనెల 18వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు రూ. 5వేలు డీడీ తీసి, రెవెన్యూ విభాగంలో దరఖాస్తుతో పాటు సమర్పించాలన్నారు.

పరామర్శ

బొంరాస్‌పేట: ఇటీవల గ్రూప్-1 పరీక్షరాసి తిరిగివసస్తూ బైక్‌పై నుంచి పడి బీఆర్‌ఎస్ పార్టీ యువజన నాయకుడు నెహ్రూనాయక్ భార్య చనిపోయింది. బుధవారం బీఆర్‌ఎస్ నాయకులు నెహ్రూనాయక్‌ను పరామర్శించారు. ఇందులో బొంరాస్‌పేట, మండలాల నాయకులు తిరుపతయ్య, బోగమోని సురేశ్ తదితరులున్నారు.

కొండాకు సన్మానం

తాండూరు రూరల్: ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు, గౌతపూర్ ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి సన్మానించారు. ఎంపీగా గెలిచిన మొదటిసారి యాలాల మండలంలో జరిగిన ఓ సమావేశానికి బుధవారం విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. నరేందర్‌రెడ్డి బుధవారం కొండాను కలిసి శాలువ, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఉన్నారు.

ఎంపీకి స్వాగతం

అనంతగిరి: ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బుధవారం వికారాబాద్‌లో జరిగిన స్కూల్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వికారాబాద్ విచ్చేసిన ఎంపీకి బీజేపీ జిల్లా నాయకుడు వడ్ల నందు అతని అనుచరులు కలిసి శాలువాతో సన్మానించి, స్వాగతం పలికారు. ఆయన వెంట ధారూర్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజునాయక్, వికారాబాద్ వైస్ ఎంపీపీ రాములు, ఎంపీటీసీలు శ్రీకాంత్‌రెడ్డి, బందయ్య, గోపాల్, శరన్‌రెడ్డి, సర్పంచులు బుచ్చిరెడ్డి, వెంకటయ్య, రాజు ఉన్నారు.



తాండూరు రూరల్: విశ్వేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి

సెయింట్ మార్క్స్ స్కూల్‌ను మూసేయాలి



స్కూల్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

ఏబీవీపీ విద్యార్థి సంఘం డిమాండ్

తాండూరు టౌన్: ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న పట్టణంలోని సెయింట్ మార్క్స్ జూబ్లీ (ఇంటర్నేషనల్) స్కూల్‌ను మూసేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీబీఎస్ఈ అనుమతి, ఉపాధ్యాయుల విద్యార్హతలకు సంబంధించిన పత్రాలను చూపెట్టాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. ఈ మేరకు పాఠశాల ఎదుట కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీబీఎస్ఈ సిలబస్‌ను చెబుతున్నట్లుగా ప్రచారం చేసుకుని విద్యార్థుల భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేస్తున్న సెయింట్ మార్క్స్ స్కూల్ అనుమతిని రద్దు చేయాలన్నారు. అర్హత లేని ఉపాధ్యాయులతో బోధన నిర్వహిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ విషయమై విద్యాశాఖాధికారులు పట్టించుకుని స్కూల్‌పై తగు చర్యలు తీసుకోని యేడల ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మౌనేశ్వర్ చారి, నవీన్‌గౌడ్, కార్యకర్తలు హెచ్చరించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

యాలాల: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, బుగ్గప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం యాలాలలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 7 నెలలుగా వేతనాలు రాకపోవడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్ వేతనాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ..పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని, మిగతా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. కార్యక్రమంలో షబ్బీర్, ఆరిఫ్, రాములు, యాదప్ప, చంద్రప్ప, లచ్చప్ప, మొగులప్ప, శ్యామమ్మ, సరస్వతి, అంతమ్మ ఉన్నారు.

రైతు రుణమాఫీపై త్వరలో స్పష్టత

లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు

మర్పల్లి: రైతులకు రూ. 2 లక్షలు రుణమాఫీ హామీ విశయమై ఈ నెల చివరి వరకు స్పష్టత రానుందని లీడ్ బ్యాంకు మేనేజర్ రాంబాబు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మర్పల్లి ఎస్‌బీఐ మేనేజర్ బి బాబు ఆధ్వర్యంలో మర్పల్లి, మోమిన్‌పేట్, బంట్వారం మండలాల బాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ.. రుణమాఫీ హామీని ఆగస్టు 15 వరకు కచ్చితంగా అమలు చేయనున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈ నెల చివరివారంలో మంత్రివర్గం, రాష్ట్రస్థాయి బ్యాంకర్లు, రాష్ట్ర స్థాయి వ్యవసాయ శాఖ అధికారులతో పాటు ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి రుణమాఫీపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టత ఇవ్వనున్నారని ఆయన తెలిపాడు. 2024-25 ఆర్థిక సంవత్సరం కోసం బ్యాంకులకు ఇచ్చిన రుణాల టార్గెట్ అమలు చేయాలని బ్యాంకర్లకు సూచించారు. పంటరుణాల కోసం రైతులు బ్యాంకులకు వస్తే వెంటనే రుణాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మర్పల్లి ఎస్‌బీఐ మేనేజర్ బి. బాబు, మర్పల్లి యూనియన్ బ్యాంకు ఫీల్డ్ అధికారి విశాలి, ఎంపీడీఓ రాజమల్లయ్య, మర్పల్లి ఏఓ వసంత, ఏపీఎం మధుకర్, ఆయా మండలాల ఎంపీడీఓలు, బ్యాంకుల మేనేజర్లు, ఆయా మండలాల ఏఓలు, ఏపీఎంలు, ఏఈఓలు, సీసీలు తదితరులు ఉన్నారు.



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ రాంబాబు

అభివృద్ధికి కలిసి పనిచేద్దాం



యాలాల: సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

- ఈజీఎస్ పథకం నిర్విరామంగా కొనసాగుతుంది
- ప్రాజెక్టుల అభివృద్ధికి అధిక నిధులు
- సర్వసభ్య సమావేశంలో ఎంపీ కొండా, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యాలాల: నియోజకవర్గ అభివృద్ధికి కలిసి పని చేద్దామని చేవేళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యేతో కలిసి పని చేస్తామన్నారు. అంతకుముందు సమావేశంలో మాజీ ఎంపీపీ, ఎంపీటీసీ కరణం పురుషోత్తంరావు ఉపాధి హామీ పథకాన్ని నిలిపివేయనున్నట్లు వస్తున్న వార్తలను ప్రస్తావించారు. నియోజకవర్గంలో అధ్వానంగా మారిన రోడ్లు, బ్రిడ్జిల ఆవశ్యకతను ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంలో ఎంపీ స్పందిస్తూ.. కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఉపయోగకరమైన ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేస్తుందని తాను భావించడం లేదన్నారు. మారుతున్న కాలాన్ని బట్టి ఈజీఎస్ పథకంలో మార్పులు చేసి మరింత ఉపయోగకరంగా చేస్తుందన్నారు. రోడ్లు, బ్రిడ్జిలపై త్వరలో సమీక్షించి నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా వ్యవసాయ అధికారులు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉండి సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. మార్కెట్‌లో నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం నియోజకవర్గంలో తరుచూ కరెంటు కోతలపై ట్రాన్స్‌కో ఏడీ ఆదినారాయణను ప్రశ్నించారు. చిన్నపాటి గాలి, వానకు కరెంటు సరఫరా ఎందుకు నిలిపివేస్తున్నారని నిలదీశారు. ఇందుకు స్పందించిన ఏడీ..గాలి, దుమారం ఉన్నప్పుడు పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సరఫరాలో ఇబ్బందులు ఉండకూడదనే ఉద్దేశంతో కొద్ది సేపు మాత్రమే సరఫరా నిలిపివేస్తున్నామని చెప్పారు.

ప్రాజెక్టుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

మండల పరిధిలోని శివసాగర్, జుంటుపల్లి ప్రాజెక్టుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. జుంటుపల్లి, కోట్‌పల్లి ప్రాజెక్టుల అభివృద్ధికి రూ.200 కోట్ల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించామని త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయన్నారు. ఐదేళ్ల పాటు ప్రజాసేవలో ఉన్న ఎంపీటీసీల పదవి కాలం త్వరలో ముగుస్తుందన్నారు. రానున్న కాలంలో మరోమారు ప్రజాసేవకు ముందుకు రావాలన్నారు. అంతకుముందు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అచ్యుతాపూర్ పంచాయతీ కార్యదర్శి సుమిత్రాబాయికి సంతాపం తెలుపుతూ నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రమేశ్, సొసైటి చైర్మన్ సురేందర్‌రెడ్డి, కోఆప్షన్‌సభ్యుడు అక్బర్‌బాబా, తహసీల్దార్ మునిరోద్దీన్, ఎంపీడీఓ పుష్పలీల, ఎంపీఓ యాదయ్య తదితరులు ఉన్నారు.